

# జాతీయం

— వేమల మీనాక్షిదేవి

"లక్ష్మీపురంలో బాపూరెసిడెన్షియల్ పాఠశాల ప్రారంభించబోతున్నాం. ఉన్న వూళ్ళో విద్యా సౌకర్యం లేక దూరం నడిచి వెళ్ళి చదువుకో వలసి వస్తోంది చాలామంది పిల్లలు, ఈ ప్రాంతం లోని గ్రామాలలోని పిల్లల సదుపాయం కోసం తలపెట్టిన కార్యక్రమం యిది. క్రమశిక్షణ, సత్ప్రవర్తన నేర్పి, ఆదర్శ వంతులుగా వారిని తయారు చేయడం మా ఆదర్శం.

స్వయం ఉపాధి కల్పనగా నిరుద్యోగ సమస్యకు పరిష్కారంగా కూడా ఈ సంస్థ తోడ్పడుతుంది. నిరుద్యోగులైన విద్యా వంతుల నాహ్వానిస్తున్నాం. వారి సహకారాన్ని అర్థిస్తున్నాం."

కన్వీనర్ కె. రాజారాం యం. యస్సి,
లక్ష్మీపురం, ఆంధ్రప్రదేశ్

ప్రముఖ పత్రికలలో వెలువడిన ఈ ప్రకటన పలువురి నాకర్షించింది. ఉద్యోగాన్వేషణలో తిరిగి తిరిగి విసిగి వేసారిన కొందరు తమకు ఉద్యోగం కావాలని వ్రాశారు.

అతని మిత్రులు ఆ ప్రకటన చూసి అభినంద నలు తెలియజేశారు.

ఆ చుట్టుప్రక్కల గ్రామాలలోని తల్లిదండ్రు లకు ఆ ప్రకటన ఆనందం కలుగజేసింది. ఎండలో వానలో, చలిలో తమ పిల్లలు మైళ్ళకు మైళ్ళు నడిచి వెళుతున్నారు. అక్కడ వసతి సౌకర్యం వుంటే పిల్లలు సుఖంగా చదువుకుంటారు, అని ఎంతో భారం దిగినట్లు అనుభూతి పొందారు.

రాజారాంని కలుసుకుని వివరాలు అడిగారు.

పిల్లలు సెలవలలో ఇళ్ళకు వెళ్ళవచ్చును. స్కూలువున్న రోజులలో వసతి, భోజనం అక్కడ ఏర్పాటు చేస్తారట. గురుకులం పద్ధతిలో నడపడం ఆయన ఆశయమట. అందుకు ఎవరికి తోచిన సొమ్ము వారు కట్టవచ్చు. పాఠాలు చెప్పడానికి మేష్టర్లని నియమిస్తారు.

రాజారాం చెప్పిన విషయం చాలామందికి నచ్చింది. పిల్లల చదువుకి యెక్కడైనా జీతం కట్టవలసిందే. అక్కడే వుంటే సుఖంగా చదువు సాగుతుంది. రోజూ అన్నమో, టిఫినో యివ్వడం గాని, ఏదైనా కొనుక్కుందుకు డబ్బు యివ్వడం గాని జరుగుతోంది. అందుకు ఇక్కడ కొంత డబ్బు కట్టవలసినందువల్ల ఇబ్బందేమీ లేదు. వచ్చిన వారిలో చాలామంది తమ పిల్లలను చేర్చ డానికి ముందుకు వచ్చారు.

ముందుగా స్థలం చూసుకుని, ఆ తరువాత ఏర్పాట్లన్నీ పూర్తవగానే ప్రారంభిస్తామని వాళ్ళతో చెప్పాడు రాజారాం.

ఉద్యోగం కోసం తనకు వ్రాసిన వారికందరికి వుత్తరాలు వ్రాశాడు. వారి సహకారంతో నిర్వహించ దలచానని తెలియజేశాడు.

లక్ష్మీపురంలోనూ ఆ పరిసర గ్రామాలలోను ధనవంతులైన కమ్మవారు, రెడ్లు, రాజులు వున్నారు. వారిలో వయసుమళ్ళిన ఒక రెడ్డిగారు తాత్కా లికంగా స్థలం యిస్తానన్నారు. రాజారాం తలపెట్టిన పద్ధతి యెంతవరకు కొనసాగుతుందో తెలియదు. అనుకున్నట్లుగా జరిగి, అభివృద్ధి చెందితే ఆ స్థలం శాశ్వతంగా ఆ సంస్థకి తన పేరు మీదుగా యిచ్చేస్తానన్నారు.

ఆయన సహకారానికి ముగ్ధుడయాడు రాజారాం. రెడ్డిగారు యివ్వచూపిన స్థలం వూరుకి చేరువలోనే

వుంది. ఆ వూళ్ళో వున్న మిత్రులతో ఆలోచించాడు. మట్టిగోడలతో మూడు గదులు ఒక హాలు కట్టడం, కప్పు తాటాకుతో వెయ్యడం. చుట్టూ సరిహద్దుగా మొక్కలు పాతించాలని తల పెట్టాడు.

ఇదంతా అక్కడి ప్రజలలో ఆనందోత్సాహాల్ని కలిగించింది.

కొందరు తాటిచెట్ల ఆకులను కొట్టించి పంపారు. తాటిదూలాలు, వాసాలు కొందరు పంపారు. తమ బట్టీలో తీయించిన ఇటుక వుందంటూ కొందరు పంపారు. ఇదంతా చూసి పనివాళ్ళు తీరిక వేళల్లో, రాత్రివేళ వుచితంగా పని చెయ్యడానికి తమ సంసిద్ధత వ్యక్తం చేశారు.

నెలరోజులలో పర్ణకుటీరాలు తయారయాయి. ప్రక్కనున్న పట్నంనుండి స్వచ్ఛంద సేవకులు వచ్చి సహాయ కార్యక్రమంగా ఆ యిళ్ళను తీర్చి దిద్దడంలో తోడ్పడ్డారు. వేసవి సెలవవడంవల్ల శ్రమదానం అంటూ కొందరు యువకులు ఆ ప్రాంగణం అంతా శుభ్రపరచారు. సరిహద్దుగా జిల్లేడు, పచ్చగన్నేరు మొక్కలను దగ్గర దగ్గరగా పాతారు.

క్షణాల మీద స్కూలు నిర్మాణం జరిగి పోయింది.

ఉద్యోగం యివ్వదలచిన వారికి రమ్మని వుత్తరాలు వ్రాశాడు రాజారాం. వారికి రాజారాం చేపట్టిన యీ పద్ధతి నచ్చింది. అన్నిటినీ మించి ప్రజల సహకారం ఆశ్చర్యం, ఆనందం కలిగించింది. తాను తలపెట్టిన పనికి రూపకల్పన అందరి సహకారంతో జరగడం రాజారాం వుత్సాహాన్ని వెయ్యిరెట్లు పెంచింది.

కొత్తలో కొన్ని చిక్కులెదురైనా తలపెట్టిన పనిని విడిచే ప్రసక్తే లేదు. సాధించి తీరాలి అన్న దృఢ నిశ్చయానికి వచ్చాడు రాజారాం.

ప్రారంభోత్సవానికి మంచి రోజు నిర్ణయించమని ఒక శాస్త్రులుగారిని కోరాడు.

అక్కడికి పది మైళ్ళ దూరంలో వున్న పట్టణానికి విద్యామంత్రిగారు వస్తారని పేపర్లో చదివాడు. ఆయనచేత ప్రారంభం చేయిద్దామని అక్కడికి వెళ్ళాడు రాజారాం.

"ఇప్పుడే వచ్చారు. ఎవరినీ యిప్పుడు చూడరు."

"ఎక్కడికో వెళ్ళారు. ఎప్పుడు వస్తారో తెలియదు."

"అప్పాయింట్‌మెంటు ముందుగా ఏర్పాటు చేసుకున్నారా?"

ఇత్యాది జవాబులు అక్కడి జవాన్లు చెప్పారు.

పట్టువదలని విక్రమార్కుడిలాగ రెండు మూడు మార్లు తిరగ్గా తిరగ్గా చివరకు మంత్రిగారి దర్శనం అయింది. అయితే, ఎక్కడికో వెళ్ళడానికి బైటకు వస్తున్నారాయన. ఆయనకు నమస్కరించి తను వచ్చిన పని చెప్పాడు.

"ఇవి సాగేవా? నిలిచేవా? ఇలాంటి వాళ్ళని చాలామందిని చూశాం. నాకు తీరుబడి లేదు" అని కారెక్కి వెళ్ళిపోయాడు మంత్రిగారు.

"స్వయం వుపాధిపథకం అంటూ ప్రభుత్వం పెద్దలు చెబుతున్నారే! ఉద్యోగాలకు ప్రభుత్వాన్ని వేధించకుండా ఈ పథకం ఎవరికివారు అమలు పరచగలిగితే నిరుద్యోగ సమస్యే వుండదు. విద్యావంతులు చేపట్టవలసిన పథకం ఇది" అంటున్న యిటువంటి పెద్దలు యిలాగేనా మాట్లాడ్డం! వారు సంకల్పించిన పద్ధతిలో ఆదర్శవంతమైన, ప్రయోజనకరమైన బృహత్ప్రణాళికను విద్యావంతులైన యువకులు స్వంతంగా నిర్వహించబూనడం మెచ్చుకోవలసినదికాదా? పెద్దలు చెప్పేవి వట్టి కబుర్లేనా!

విస్తుపోయాడు రాజారాం.

ఆ వూళ్ళో వున్న యం. యల్. ఎ.ని ఆహ్వానించాడు.

"అబ్బో.... నాకెక్కడి తీరిక? 'అర్జంటు పని మీద ఢిల్లీ వెడుతున్నాను. మరెవరినైనా చూచుకోండి" అన్నాడు తనేదో పెద్ద అధికారిలాగ!

రాజారాంకి మహా చికాకనిపించింది.

స్వాతంత్ర్య సమరంలో పాల్గొని, జైలుకి వెళ్ళి చాలా బాధపడిన రాజకీయ బాధితుడుగా నిలిచి పోయిన 'గాంధీపంతులు'గుర్తుకి వచ్చాడు. ఆనాడు 'ఓహో' అని మెచ్చుకున్నవాళ్ళూ, ఆయన మాట్లాడితే మైమరచి వినేవాళ్ళూ ఈనాడు ఆయన ఎదురుపడితే పలకరించరు సరికదా ముఖం చాటేసుకుని తిరుగుతారు. ఆయన వున్నాడన్న గుర్తింపేలేదు. రాజకీయ బాధితులకు సంక్రమించిన సదుపాయాలు ఈయనవరకు రాలేదు. ప్రభుత్వాన్ని ఎన్నడూ యీయన అడగలేదు! మోకాళ్ళవరకు ఖద్దరు బట్ట కడతాడు. మెడలో ఒక అంగవస్త్రం. అందుకే ఆయన్ని గాంధీపంతులు అంటారు. అందరితోనూ అంటే తనతో మాట్లాడేవాళ్ళతో ఎంతో సంతోషంగా మాట్లాడుతాడు.

ఆయనచేత ప్రారంభోత్సవం చేయించాలనే ఆలోచన కలిగింది రాజారాంకి. ఆ ఆలోచనని అంతా హర్షించారు.

*

ఆనాడు లక్ష్మీపురం అంతా కోలాహలంగా వుంది. ఆ వూరే కాదు. ఆ చుట్టుపట్ల గ్రామాలలో కూడా ఆనందం వెల్లివిరుస్తోంది. నూతన పాఠశాల ప్రారంభోత్సవం చూడ్డానికి కుతూహలంతో చేరుకుంటున్నారు.

ఆ ఆవరణ అంతా మామిడితోరణాలతో అలంకరించారు. ఇసుక వేస్తే రాలనంత జనంతో నిండి పోయింది ఆ ప్రదేశం. అందరిలో ఆనందం.... ఎవరికివారే తామే యిదంతా చేస్తున్నాం అనే తృప్తి.... అనుభూతి పొందుతున్నారు.

ఆనాటి సభకు ముఖ్య అతిధి గాంధీపంతులు వేదిక మీదకు రాగానే ప్రజలు దిక్కులు పిక్కటిల్లేటట్లు హర్షధ్వానాలు చేశారు. ఆ స్థలం యిచ్చిన రెడ్డిగారి చేత గాంధీపంతులు మెడలో వడికిన నూలు మాలను అలంకరింపచేశాడు రాజారాం.

గాంధీపంతులు మాట్లాడుతూ—'చిన్నవాడైనా రాజారాం తల పెట్టినపని మహోత్కృష్టమైనది. ఈ ఆదర్శ సంస్థకు పూజ్యబాపూజీ పేరు ఎంతైనా సమంజసంగా వుంది. ఆ మహనీయుని ఆశీస్సులు ఈ సంస్థకి యెప్పుడూ లభిస్తూంటాయి. ఈ ఉత్సవంలో పాల్గొనడం నా అదృష్టం. గాంధీజీ కలలు కన్న రామరాజ్య సౌధానికి ఇటువంటి సంస్థలు సోపానాలు. ముందు ముందు వృత్తివిద్యలను నేర్పించే ఏర్పాటు చేసినచో ఆయా వృత్తులవారికి ప్రోత్సాహకరంగా వుంటుంది. ఇది నా సలహా. విద్యావంతులైన యువకులు ముందుకు వచ్చి సహకారాన్నందివ్వాలి,' అని తన వుపన్యాసం ముగించాడు.

రాజారాం మాట్లాడుతూ 'నేను యూనివర్సిటీలో చదువుతుండగా విద్యార్థులం కొందరం విజ్ఞాన యాత్రకు ఢిల్లీ ప్రాంతాలకు వెళ్ళాం. ఒక మిత్రుడు మహేంద్రగడ్‌లో 'బాలచరిత్ర నిర్మాణ్' అనే ఆదర్శమైన సంస్థ వుందనీ, అది చూడవలసిన ప్రదేశం అనీ చెప్పాడు. అక్కడికి వెళ్ళాం.

ఆ సంస్థలోని పద్ధతులు, ఆచరణలో పెట్టిన ఆదర్శాలను, అక్కడి విద్యార్థులను చూసి తన్మ

యులం అయ్యాం. ఈనాటికీ ఆ సంఘటన మా మనస్సులలో చెరగని ముద్రగా నిలిచిపోయింది.

'ఆచరించు... ఆలోచించు.... ప్రచారం చెయ్యి'. అన్నది వారి మోటో...అది వారి ఆదర్శం అన్న మాట.


నా చదువైంది. వుద్యోగ ప్రయత్నం చెయ్యాలి. ఎప్పటికి వుద్యోగం వస్తుందో తెలియదు. అసలు వస్తుందో....రాదో.... మాకన్న ముందు ప్యాసైన వాళ్ళెందరో వుద్యోగాల కోసం తిరిగి తిరిగి, ఇంటర్వ్యూలకు వెళ్ళి ఆర్థికంగా ఎంతో నష్ట పోయారు. అలిసిపోయారు. నేనేం చెయ్యాలి? అని మధనపడుతున్న సమయంలో మహేంద్రగడ్ లోని ఆ సంస్థ స్థాపకుడు విశ్వనాధ్ కనోడియా రూపం లీలగా దృగ్గోచరం అయింది. ఏమి భగవం తుని లీల! ఆయన జీవితాన్ని చాలావరకు ఆ సంస్థకై ధారపోసి ఇప్పుడు వృద్ధాప్యంలో వున్నాడు. ఆయన ఆశీస్సులు లభించినట్లు అనిపిం చింది. ఆయన నాకు మార్గం తెలిపాడు. ఆ పద్ధతే ఆదర్శం. ఒక వున్నతాశయం కలిగి; తాను నమ్మిన పనిని చిత్తశుద్ధితో నిర్వహిస్తే ఫలితం కూడా వున్నతంగానే వుంటుందన్న విశ్వాసం కలిగింది. నా ఆశయానికి మీ అందరి సహకారం తోడై యీనాడు ఆనందోత్సాహాలతో ఈ ప్రారంభోత్సవం జరుపుకొంటున్నాం. ఈనాటి బిడ్డలు ముమ్మందు దేశరక్షకులు. ఇట్టివారిని సుశిక్షితులైన భారత పౌరు లుగా తీర్చిదిద్దడం మనందరిబాధ్యత. స్వయంవుపాధి కల్పనగా నిరుద్యోగ సమస్య నివారణకు కూడా యిది చక్కని అవకాశం. అడగకుండానే తమ స్థలాన్ని యిచ్చిన శ్రీ రెడ్డిగారికీ, కట్టుకి సహాయ పడిన పెద్దలకు, యువకులకు నా ధన్యవాదాలు.... తమ పిల్లలను చేర్చడాని కంగీకరించి వుత్సాహంగా ముందుకు వచ్చి చేయూతనిచ్చిన తల్లిదండ్రులకు నా కృతజ్ఞత ...నలుగురు ఉపాధ్యాయులు యిక్కడ వుద్యోగానికి వచ్చారు....ప్రస్తుత పరిస్థితిలో జీతం అంటూ యివ్వలేమనీ, కొంత స్థిరం యేర్పడగానే యథాశక్తి వేతనం యివ్వగలననీ, అంతవరకు వారికి భోజనవసతి సౌకర్యాలుంటాయనీ చెప్పాను. అందుకు వారు అంగీకరించడమేకాక స్వయం వుపాధికల్పనపద్ధతి చేపట్టినందుకు ఆనందించారు. తమ శక్తివంచన లేకుండా నా కృషికి తోడ్పడతా మన్నారు వారికి నేనెంతో కృతజ్ఞుణ్ణి.

ఇంటింటి కొక పువ్వు, ఈశ్వరుని కొక మాల. మీ అందరి సహకారం ఈ సంస్థ అభివృద్ధికి ఆధారం.

రాజారాం మాట్లాడినంతసేపూ జనం నిశ్శబ్దంగా విన్నారు. కొత్తగా వచ్చిన వుపాధ్యాయులను పరి చయం చేశాడు అతను.

50 మంది విద్యార్థులతో నలుగురు మేష్టర్లతో ప్రారంభమైన బాపూ రెసిడెన్షియల్ సంస్థ నాలుగు సంవత్సరాలలోనే పేరు పొందింది. విద్యార్థుల సంఖ్య పెరిగింది. ఉపాధ్యాయులకు జీతాలు సంస్థ ప్రారంభించిన ఆరు మాసములనుండి లభిస్తున్నాయి.

ఆ వూళ్ళో కొత్తగా జూనియర్ కళాశాల, పోలిటెక్నిక్ కళాశాల వచ్చాయి. తమ ప్రాంతంలో సీటు దొరక్క ఇక్కడ చేరిన విద్యార్థులు ఈ సంస్థలో వుండేవారు. ఎక్కడెక్కడ చదువు కుంటున్నవారైనా ఆ హాస్టల్‌లో వుండవచ్చు.




అందుకు తగిన ఏర్పాటు చేయబడింది. అందుకు వాళ్ళు కట్టేడబ్బు ఏమంత యెక్కువ కాదు.

*

గాంధీజయంతి, స్వతంత్రదినం, ఆంధ్రరాష్ట్రావతరణ వంటి సందర్భాలలో ప్రత్యేక సమావేశాలు జరిపి, ప్రజలను, విద్యార్థుల తల్లిదండ్రులను ఆహ్వానించేవాడు రాజారాం.

ఆ ప్రాంగణంలోనే కాదు – ఏ గదిలో చూచినా చిన్న కాగితం ముక్కగాని, చిటికెడు దుమ్ము గాని లేదు; బల్లలు కుర్చీలు ఏరోజుకారోజు శుభ్రంగా బట్టతో తుడుస్తారట. ముందు వున్న హాలులో మహాపురుషుల చిత్రపటాలు నాలుగు వైపులా గోడలకు అమర్చారు. ఆ చిత్రాల క్రింద వారి జీవితాల నుండి మనం నేర్చుకోవలసిన విషయాలు ఒక్కమాటలో వ్రాసి వున్నాయి. ఉదాహరణకు సర్దార్ పటేల్ పటం క్రింద 'దృఢ సంకల్పం' (Strong man), గాంధీజీ పటం క్రింద 'అహింస', సుభాస్‌చంద్రబోస్ పటం క్రింద 'సాహసి' వంటి వన్నమాట.

ఒక చిన్న లైబ్రరీ ఏర్పాటు చేశారు. కొందరు మంచి మంచి పుస్తకాలు బహూకరించారు. అక్కడివారికే కాకుండా వూళ్ళో వాళ్ళు కూడా వచ్చి ఆ లైబ్రరీ వుపయోగించుకోవచ్చు. చందా స్వల్పంగా చెల్లించాలి అందుకు.

ఒక గదిలో దేవుని పటం. ఆ ప్రక్కని ఒక బల్ల వుంది. ఆ బల్లమీద భగవద్గీత, భీష్మ స్తవ రాజము, గజేంద్ర మోక్షము (పోతనది) చిన్న సైజు పుస్తకాలున్నాయి.

రోజూ ఉదయం నాలుగున్నరకు అందరూ లేస్తారు. అక్కడ వున్నవాళ్ళల్లో రోజుకి ఒకరు గే మేష్టరుగా వ్యవహరిస్తారు. అంటే ఆనాడు అతడు యుగతా అందరికీ లీడరు అన్నమాట. ఆ విధమైన అవకాశం అందరికీ వస్తుంది. ఆనాడు 'ఉదయం ప్రార్థన మొదలు లోపల బైట ప్రదేశాలు శుభ్రపరచడం, వంట ఏర్పాట్లు మొదలైన పను లన్నీ సక్రమంగా నిర్వహిస్తాను.' అని రిజిష్టరులో వ్రాసి సంతకం చేస్తాడు. అతడు చెప్పిన ప్రకారం అంతా నడుచుకుంటారు. ఈ పద్ధతి నాయకత్వం వహించడం, విచక్షణాజ్ఞానం మొదలైనవాటికి దారి తీస్తుంది. ఇదెంతో మంచి అవకాశం.

రోజుకి ఒక విద్యార్థి భగవద్గీతలోని రెండు శ్లోకాలు ఒక డ్రాయింగ్ పేపరు మీద వ్రాసి, చదివి, వాటి వ్యాఖ్యానాన్ని చదువుతాడు. ఆ విధం గానే భీష్మ స్తవంలోవీ, గజేంద్రమోక్షంలోవి వ్రాసి, అర్థం, పద్యాలు చదువుతాడు. ఆ విధంగా రోజూ వ్రాసిపెట్టిన డ్రాయింగ్ పేపర్లలో మంచి దస్తూరీ వున్న పేపరుకి బహుమతి యిస్తారు.

ఆ విధంగా చేవ్రాత ప్రతులు పుస్తకాలుగా తయారయాయి. ఒక వ్రాత పత్రిక నడుపుతున్నారు. అందులో కథలు, కవితలు, చేతనైనవాళ్ళు బొమ్మలు వేస్తారు. అల్లాగే పిల్లలచేత ఒక మ్యూజియమ్ రకరకాల వస్తువులతో ఏర్పరచబడింది.

చిన్న తోట వుంది. దానిని బాలవాటిక అంటారు. వాళ్ళ యిళ్ళల్లో వున్న పూలమొక్కలు, తమకు ఆయాచితంగా కనబడిన అపురూప మొక్కలను తెచ్చి అక్కడ పాతి, రోజూ వాటి పరిరక్షణ

చేస్తూంటారు పిల్లలు. ఆ తోట యెంతో చూడ ముచ్చటగా వుంది.

అందరిదీ ఒక్క మాట. అందరిదీ ఒక్క బాట.

అన్నిపనులూ పిల్లలే చేసుకుంటారు.

ఈ విధంగా పిల్లలే పిల్లల కోసమే అన్నీ నిర్వహిస్తూ పెద్దలకు కూడా మార్గదర్శకమౌతున్నారు. ఈ ప్రదేశం చూస్తూంటే బాపూజీ కలలు కన్న మరో ప్రపంచం అనిపిస్తుంది.

ఎనిమిది సంవత్సరాలు గడిచాయి. తాటాకు యింటిస్థానే డాబా యిల్లు వెలిసింది. ఒకరు తమ పేరుతో లైబ్రరీ హాలు కట్టించారు. మరొకరు ప్రత్యేక కార్యక్రమాలు జరుపుకొందుకు ఒక వేదిక కట్టించి యిచ్చారు. కొందరు తమ పేర బీరువాలు లైబ్రరీకి బహూకరించారు పుస్తకాలు పెట్టుకుందుకు. చందాదారుగా చాలామంది చేరి వచ్చి చదువుకుంటూంటారు.

బాపూజీ రెసిడెన్షియల్ సంస్థ ప్రఖ్యాతినార్జించింది. స్థానిక పత్రికలు, వివిధ పత్రికలు ఆ సంస్థ ప్రత్యేకతను ప్రకటించాయి. అభినందనలతో విరాళాలను ఎందరో పంపుతూండేవారు.

ఉపాధ్యాయుల జీతాలు, ఖర్చులు పోను బ్యాంకిలో కొంత సొమ్ము నిలవకాసాగింది. తాత్కాలికంగా యివ్వబడిన ఆ స్థలం శాశ్వతంగా వ్రాసి యిచ్చేశారు రెడ్డిగారు. కొందరు ధనవంతులు తెలివైన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లకనీ, బహుమతులకనీ సొమ్ము యిచ్చేవారు.

చిత్రం ఏమిటంటే ఆ వూళ్ళో వుండే స్కూళ్ళలో బీద విద్యార్థులకు జీతం కట్టడం, పుస్తకాలు కొనడంవంటివి చేసేవాడు రాజారాం. బాగా చదివే విద్యార్థికి మెడల్ ఏర్పాటు చేశాడు.

ఆ సంస్థ స్థాపించిన పన్నెండో సంవత్సరంలో ఒక వృద్ధురాలైన ధనవంతురాలు తను వుండే మేడ, పాతికవేల రొఖ్ఖం ఆ సంస్థకు రాసి యిచ్చింది. మేడను ఏ విద్యార్థులకైనా సరే వసతి గృహంగా వుపయోగించమనీ, ఆ రొఖ్ఖం మీద వచ్చే వడ్డీతో ఏటా పేద విద్యార్థుల చదువు నిమిత్తం ఖర్చు చేయమని వ్రాసింది.

ఆమెకు పిల్లలు లేరు...

ఆ పురజనులే కాదు రాజారామే దిగ్భ్రాంతి చెందాడు. ఇదంతా ఆ భగవంతుని కృప...బాపూజీ ఆశీస్సుల ప్రభావం. ఈ సంస్థ స్థాపనకు మార్గదర్శకుడైన విశ్వనాథ్ కనోడియా మనస్సులో మెదిలాడు. ఆయనను చూస్తుంటే మహోన్నతమైన వ్యక్తిత్వం బైటపడుతుంది. ఆయన పడక గదిలో కృష్ణుడు అర్జునునకు గీతోపదేశం చేస్తున్నట్లున్న నిలువెత్తు పటం వుంది. అది చూస్తుంటే ఆయన పిల్లలచేత తన చేయూతతో నడిపిస్తున్న ఆ ఆశ్రమమే ఒక సింబాలిజంవలె కనిపించింది తనకి।

రాష్ట్ర వ్యాప్తమైన లక్ష్మీపురం బాపూజీ రెసిడెన్షియల్ సంస్థ ప్రఖ్యాతి ప్రభుత్వం దృష్టిలో పడింది. ఈ సంస్థ ఆర్థికంగా యింత స్థిరపడడానికి ధనం యెలాగ వచ్చింది? ఇందుకే మార్గాలనవలంబించారు? వీరికి విరాళాలిచ్చేవారు ఇన్‌కమ్‌టాక్స్ బారినుండి తప్పించుకుందుకు యిస్తున్నారా? ఈ సంస్థకు బ్యాంకి ఎక్కౌంటు యెంత వుంది? అని ఆరాలు తీయడం ప్రారంభించింది.

ఎక్కడో ఒక సభలో మంత్రిగారు తమ ప్రసంగంలో "నిరుద్యోగులకు విద్యావంతులు స్వయం వుపాధి కల్పన పథకం క్రింద పనులు చేపట్టడం మంచిదనీ, ప్రభుత్వం ,వారికి చేయూతనిస్తుందనీ అన్నారు. ఆ పథకం క్రింద నడుపబడుతున్నదే లక్ష్మీపురంలోని బాపూ రెసిడెన్షియల్ కాన్వెంట్.... ఈనాడు యెంత అభివృద్ధిలో వున్నదీ అందరికీ తెలిసినదే" అన్నారు.

తమరే చేశామని స్థానిక యం. యల్. ఎ.లు అన్నారు.

ఇది విన్న రాజారాం, తోటి వుద్యోగులు, ప్రజలు ఆ సంస్థ అభివృద్ధికి దోహదం చేసిన పెద్దలు విస్తుపోయారు. ప్రారంభోత్సవానికి రావడానికి తిరస్కరించిన వీరు ఈనాడు ఈ సంస్థ సాధించిన అభివృద్ధికి తామే కారకులమనడానికి సిగ్గులేదా? అనుకున్నారు.

కేంద్ర అపరాధ పరిశోధక బృందం జాగరూకతతో పరిశీలించి ఇందులో మోసం ఏమీ లేదని నిర్ణయించింది!! ఆదాయం పన్నుశాఖ ఎంత గింజుకున్నా నల్లధనం వుపయోగించబడలేదని తేలింది। ఇంత అభివృద్ధి సాధించిన ఆ సంస్థ ప్రభుత్వ ప్రేరితమైనదని ప్రకటించాలని స్థానిక రాజకీయ నాయకులు ప్రభుత్వంపై వత్తిడి తెచ్చారు।

*

ఒక రోజున హటాత్తుగా రేడియో వార్తలలో ఒక ఆర్డినెన్స్ ప్రభుత్వం ప్రకటించినట్లు ప్రసారం చెయ్యబడింది.

"ప్రజాబాహుళ్య ప్రయోజనాల దృష్ట్యాను, ఇంతవరకు ప్రభుత్వం చేసిన అమితమైన సహాయం దృష్ట్యాను, ఈ సంస్థకు గల ఆర్థిక వనరులను స్వార్థపరుల చేతులనుండి రక్షించుటకును లక్ష్మీపురంలోని బాపూ రెసిడెన్షియల్ సంస్థ ఈ ఆర్డినెన్సు మూలంగా జాతీయం చెయ్యబడింది।" □



"ఢిల్లీ సమీపంలో ఒక చిన్న వూళ్ళో ఇటువంటి ఆదర్శ ఆశ్రమ పాఠశాల వున్నది. అక్కడి క్రమశిక్షణ, విద్యార్థుల స్వయంకృషి, సంచాలకుల మనస్సు గ్రహించి పిల్లల ప్రవర్తన గూర్చి ఒక విద్యాధికారి విజిటర్స్ బుక్‌లో మనస్ఫూర్తిగా వ్రాస్తూ-'ఇటువంటి పాఠశాలల ఉన్నతికి మన ప్రభుత్వ కళాశాలలు ఎదిగితే బాగుణ్ణు' అని వ్రాశారు.

స్వయంసమృద్ధిగా బాగావున్న విద్యా సంస్థలను ప్రభుత్వం జాతీయం చేయడం జరుగుతోంది. ఈ పాఠశాల నాదర్శంగా తీసుకుని దేశం అంతటా ఇటువంటివి రూపొందితే బాగుంటుందనిపించింది.

ఆ స్ఫురణతో ఈ కథ వ్రాశాను. దీనిలో స్వయం వుపాధి కల్పనకు మార్గదర్శకంగానూ వుంటుందని ఆ సమస్యకు కూడా ప్రాధాన్యత నిచ్చి నిరుద్యోగులైన యువకులు ఈ పాఠశాలను స్థాపించి ఆదర్శంగా దిద్ది తీర్చినట్లు వ్రాశాను."